క్లుప్తంగా

కల్వర్టుల నిర్మాణ పనుల పరిశీలన



పుల్లూరు(మైలవరం): మైలవరం మండలం పుల్లూరు దళితవాడలో ప్రధాన ఏరియాల్లో రెండు కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి ఆదివారం ఆ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రకృతివ్యవసాయం కూడా నెమ్మదిగా ఊపందుకుంటోందని తెలిపారు.

విద్యా వ్యవస్థ పటిష్టతకు కృషి



ఇబ్రహీంపట్నం: విద్యా వ్యవస్థ పటిష్టతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదవడం, రాయడం, ఆంగ్లంపై చొరవ తీసుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, మనోహర్ కుమార్ యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం చేపడుతున్న సదస్సులు, సమావేశాలను కొనియాడారు. జిల్లా నాయకులతో పాటు ఎంఈఓ పుష్పలత, మండల అధ్యక్షుడు బాణావత్ అమర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఆర్మ్‌స్ట్రాంగ్ పాల్గొన్నారు.

హనుమత్ క్షేత్ర వార్షికోత్సవం



తిరువూరు: తిరువూరు శ్రీస్వామి అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణంలోని పంచముఖ హనుమత్ క్షేత్ర 15వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం, సువర్చలా సహిత హనుమత్ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వీరాంజనేయ భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తిరువూరు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజారావు, సభ్యులు పర్యవేక్షించారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం



నూజివీడు: ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రభుత్వ పింఛను దారులకు పింఛన్ నగదును చెల్లించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూజివీడు ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని సమతానగర్‌లో ఉన్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఆదివారం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు సమావేశంలో ఆ సంఘ అధ్యక్షుడు బీఎం సింగ్, నాయకులు ఆర్ సాంబయ్య, ఎస్ఎస్ ప్రసాద్, వై రాధాకృష్ణ, ఎన్ రామారావు, డీ వెంకటేశ్వరరావు, గోవర్ధనరావు, భాస్కర్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



తిరువూరు: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న జరిగే ప్రజా రక్షణ భేరి ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆవిష్కరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్రప్రసాద్ తెలిపారు. సీపీఎం నాయకులు పంతంగి శ్రీనివాసరావు, మస్తాన్, రవి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు బస్‌పాస్‌ల పంపిణీ

నూజివీడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పాదయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఉదయం 9.30 గంటలకు కార్యాలయంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కేక్ కట్ చేస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. అనంతరం బాపూనగర్‌లోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లోనూ, ఎస్ఆర్ఆర్ హైస్కూల్లోను విద్యార్థులకు బస్సు పాసులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఓటు నమోదుకు 361 అర్జీలు



తిరువూరులో ఓటు నమోదుకు అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



నూజివీడు మండలం యనమదలలో ఓటు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్

నూజివీడు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 4, 5 తేదీల్లో మండలంలో నిర్వహించిన ఓటర్ల నమోదు కార్యక్రమంలో మొత్తం 361 అర్జీలు వచ్చాయి. 18 ఏళ్ల వయస్సు నిండి ఓటు హక్కు కోసం ఫారం–6ను 130 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓట్ల తొలగింపు కోసం ఫారం–7ను 25 మంది సమర్పించారు. అలాగే ఓటు సవరణల కోసం ఫారం–8కు 206 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహణను పరిశీలించారు.

తిరువూరులో 841..

తిరువూరు: ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 841 దరఖాస్తులు అందినట్లు సహాయ రిటర్నింగ్ అధికారి సురేష్‌బాబు తెలిపారు. కొత్త ఓట్లు నమోదుకు 447, ఓట్ల తొలగింపునకు 115, సవరణలు, ఓట్ల బదిలీ కోసం 277 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

ముగిసిన స్పెషల్ డ్రైవ్

తిరువూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరువూరు నియోజకవర్గంలో రెండు రోజుల పాటు ఓటర్ల నమోదుకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ఆదివారం ముగిసింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు కొత్త ఓటర్ల నమోదుకు, ఓట్ల తొలగింపులు, సవరణలు, బదిలీకి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మాధవి, సహాయ రిటర్నింగ్ అధికారి సురేష్‌బాబు పర్యవేక్షించారు. అర్జీలను ఆన్‌లైన్లో నమోదు చేసి ఓటుహక్కు కల్పిస్తామని, కొత్త ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేస్తామని అధికారులు తెలిపారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

సహకార కేంద్ర బ్యాంక్ సేవలపై అవగాహన



కళాజాతాలో పాల్గొన్న బృందం సభ్యులు

చంద్రగూడెం(మైలవరం): సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న సేవలపై రైతులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చంద్రగూడెం సొసైటీ అధ్యక్షుడు శీలం ప్రతాపరెడ్డి తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెం జిల్లా సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో చైర్మన్, సీఈఓ ఆదేశానుసారంగా నాబార్డ్ వారి సౌజన్యంతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమంలో భాగంగా కళాజాత నిర్వహించిన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ రైతులు, ప్రజలకు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతాలు తెరవాలన్నారు. కళాజాతా బృందం సభ్యులు తమ కార్యక్రమంలో భాగంగా బ్యాంక్‌లో పొదుపు ఖాతా కలిగి ఉండటం వలన అనేక లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శివ, కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న స్పందనలో డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

విస్సన్నపేట: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం స్థానిక మండలపరిషత్ ఆవరణలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఎంపీపీ భూక్యా రాణి అధ్యక్షతన సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పోలీసులమంటూ వృద్ధుడికి బెదిరింపు

రేషన్ బియ్యం ఎత్తుకెళ్లిన ఇద్దరికి రిమాండ్

జి.కొండూరు: స్పెషల్ బ్రాంచ్ పోలీసులమంటూ ఇద్దరు వ్యక్తులు ఓ వృద్ధుడిని బెదిరించడంతోపాటు దాడికి పాల్పడి రేషన్ బియ్యాన్ని ఎత్తుకెళ్లిన ఘటనపై జి.కొండూరు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. మండల పరిధిలోని చిన్ననందిగామకు చెందిన కోట ఇమ్మానియేలు అనే వృద్ధుడు రేషన్ బియ్యాన్ని సేకరించి నూకలరూపంలో మార్చి విక్రయిస్తుంటాడు. రెండురోజుల క్రితం స్పెషల్ బ్రాంచ్ పోలీసులమంటూ మైలవరానికి చెందిన ఎర్రగోపుల రాంబాబు, తోలుకోడుకు చెందిన కె.రాజు అలియాస్ రాజీవ్‌రాజు.. ఇమ్మానియేలుపై దాడికి పాల్పడ్డారు. వారిద్దరూ అతడి వద్ద నిల్వ ఉన్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంలో తీసుకెళ్లి వెల్వడం శివారులో ఉన్న రైస్‌మిల్లులో విక్రయించారు. ఘటనపై బాధితుడు జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ధర్మరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

ఈఎండీపీ సర్వే

గానుగపాడు(తిరువూరురూరల్): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించి తద్వారా భవిష్యత్‌లో వారు మంచి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు చేపట్టిన మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి విద్యాశాఖ చేపట్టిన ఈఎండీపీ సర్వేను గానుగపాడు జెడ్పీ హైస్కూల్ పరిధిలో నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేస్తున్నట్లు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఆదిలక్ష్మి తెలిపారు.

ఎంఈఎఫ్ అధ్యక్షుడిగా రామారావు

తిరువూరు: మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎంఈఎఫ్) ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా తిరువూరుకు చెందిన ఉపాధ్యాయుడు శీలం రామారావు నియమితులయ్యారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటంలో భాగంగా తిరువూరు నియోజకవర్గంలో మాదిగ విశ్వరూప మహాసభ ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అనంతరం ఎంఈఎఫ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘాధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా వై మల్లేశ్వరరావు ఎన్నికయ్యారు.

కార్తిక పూజలకు శివగిరి ముస్తాబు



శివగిరిపై ఉన్న 36 అడుగుల పంచముఖ శివలింగం, 40 అడుగుల ఓంకార స్తూపం

- నెల రోజుల పాటు స్వామి వారికి అభిషేకాలు
- పౌర్ణమి రోజు నాగసాధువులతో ప్రత్యేక పూజలు
- ప్రతి రోజూ 21 మంది జంటలతో కేదారేశ్వర వ్రతం



మల్లికార్జున శర్మ, శివగిరి వ్యవస్థాపకుడు



ఏడు అడుగుల నాగ పడగ

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): స్థానిక మొగల్రాజపురంలోని శ్రీవాగ్దేవీ జ్యోతిర్లింగ క్షేత్రం(శివగిరి) కార్తిక మాస పూజలకు సిద్ధమైంది. ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు కార్తిక మాసం సందర్భంగా శివగిరిపై ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ప్రతి రోజూ 21 జంటలతో కేదారేశ్వరవ్రతం నిర్వహించనున్నారు. శివగిరిపై 36 అడుగుల పంచముఖ శివలింగం, 40 అడుగుల ఎత్తున ఓంకార స్తూపం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, నవగ్రహాలు, శివ పరివారం, రాహు కేతువులు, దుర్గాదేవి, సరస్వతీదేవి విగ్రహాలు, అష్టాదశ శక్తి పీఠాలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం, గోశాల, ఏడు అడుగుల నాగ పుట్ట, నాగదేవత, నంది విగ్రహాలు ఉన్నాయి.

శివయ్యకు నిత్య పూజలు..

కార్తికమాసం సందర్భంగా ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు శివలింగానికి రుద్రాభిషేకం, రుద్రహోమం, కుంకుమార్చన, సహస్ర లింగార్చన, మహాలింగార్చన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు ప్రదోష పూజ, శివ కల్యాణం నిర్వహిస్తామని శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జున శర్మ తెలిపారు. కార్తిక పౌర్ణమి రోజున శివలింగానికి నాగ సాధువులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. నగర పరిధిలో భక్తులు కోరిన ప్రాంతాల్లో స్వామి వారి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు ఎవరైనా తన సొంత ఖర్చులతో శివగిరిపై శివలింగాన్ని ప్రతిష్టించుకోవచ్చన్నారు. శివగిరిపై జరిగే పూజలను సోషల్ మీడియా ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని తెలిపారు. పూజల వివరాలకు 98481 14960లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.



శివ పరివారం విగ్రహాలు



శివగిరిపై శివలింగానికి నాగ సాధువుల పూజలు (ఫైల్)

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం

తోటమూల(గంపలగూడెం): గంపలగూడెం మండలం తోటమూలలో బుడ్గజంగాల సామాజిక వర్గీయులు ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బుడ్గజంగాలను ఎస్సీగా గుర్తిస్తూ ముఖ్యమంత్రి ఆ వర్గీయులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అనుమోలు కృష్ణారావు, కోట లక్ష్మీనారాయణ, ఇడుపులపాటి రాంబాబు, ఆర్.శ్రీరామమూర్తి, బి. అంజియ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ట



విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన నూతన ధ్వజస్తంభం



విరూపాక్షి ఆలయాన్ని సందర్శించిన మంత్రి జోగి రమేష్

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడులో బాలా త్రిపుర సుందరీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయ బింబ యంత్ర శిఖర ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయం ప్రాంగణంలో అర్చకబృందం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిగా పాల్గొన్న భక్తులు ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి, నవధాన్యాలు, పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు

రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ విరూపాక్షేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అర్చక బందం సాదర స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి వార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి పాల్గొన్నారు.

'ఇగ్నో'లో అత్యుత్తమ నాణ్యతాప్రమాణాలు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యతాప్రమాణాలను పాటించే విద్యాసంస్థల్లో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) మొదటిదని ఆ సంస్థ విజయవాడ ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకుడు డాక్టర్ బి. ప్రసాద్‌బాబు అన్నారు. కేబీఎన్ కళాశాల ఇగ్నో స్టడీ సెంటర్ నూతన విద్యార్థుల ఇండక్షన్ మీటింగ్ ఆదివారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో ఇగ్నోకు ప్రత్యేక స్థానముందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు వారివారి కోర్సులకు సంబంధించి సంపూర్ణ జ్ఞానం అందించే దిశగా కోర్సు రూపకల్పన ఉంటుందన్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా ఇగ్నో ఉన్నత విద్యారంగ వ్యాప్తికి ఇతోదిక సేవలందిస్తుందన్నారు. ఇటీవలే యూజీసి నాక్ నుంచి ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్‌ను సాధించి ప్రమాణాల విషయంలో అగ్రగామిలో ఉందని రుజువు చేసిందన్నారు. తరగతుల నిర్వహణతో పాటుగా, ప్రయోగశాలలో సాధన, ఎసైన్‌మెంట్లు తదితర రూపాల్లో బోధనా పద్ధతులు ఉంటాయన్నారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో సుదీర్ఘకాలంగా ఇగ్నో స్టడీ సెంటర్ కొనసాగుతుందని వివరించారు.

స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్. సాంబశివరావు మాట్లాడుతూ తమ స్టడీ సెంటర్‌లో క్రమం తప్పకుండా తరగతులు కొనసాగటమే కాకుండా మంచి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. సుదీర్ఘకాలంగా తమ స్టడీ సెంటర్ నుంచి ఎందరో ఉన్నత విద్యా కోర్సులను పూర్తి చేసి మంచి స్థాయిల్లో నిలిచారని వివరించారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, డి. పవన్‌కుమార్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయరూ..!



కొండపల్లి రైల్వేస్టేషన్‌లో అసంపూర్తిగా ఒకటో ప్లాట్‌ఫారమ్



రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు దారిలేకుండా అడ్డుగా ఉన్న ఎన్టీటీపీఎస్‌కు వెళ్లే బొగ్గు రవాణా గూడ్స్ రైలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కొండపల్లి రైల్వేస్టేషన్ సమస్యలకు నిలయంగా మారింది. 1916వ సంవత్సరంలో నిర్మించిన రైల్వేస్టేషన్ ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. ఇటీవల పలు సమస్యలపై కొండపల్లి, ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రయాణికులు రైల్వే స్టేషన్ మేనేజర్‌కు పలు ఫిర్యాదులు చేశారు. విజయవాడ, హైదరాబాద్, వరంగల్, గుంటూరు, విశాఖపట్నం, న్యూఢిల్లీ–చెన్నై వంటి నగరాలకు ప్రధాన లైన్‌గా నిత్యం తొమ్మిది వేల మంది ప్రయాణికులు ఈస్టేషన్ మీదుగా వెళుతుంటారు. ఎన్టీటీపీఎస్ బొగ్గురవాణా గూడ్స్ రైళ్లతో పాటు ఎక్స్‌ప్రెస్‌లు, పాసింజర్ ట్రైన్లు 130 వరకు రాకపోకలు సాగిస్తాయి. రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

స్టేషన్‌కు నడకదారి లేక ఇబ్బందులు

కొండపల్లి రైల్వేస్టేషన్ స్థానిక ఎన్టీటీపీఎస్‌కు కూతవేటు దూరంలో ఉంది. థర్మల్ స్టేషన్‌లో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు రవాణా రైల్వే ట్రాక్ స్టేషన్‌కు ప్రధాన రహదారి అయిన పడమర వైపు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు రైళ్లు ఎక్కేందుకు తూర్పు వైపున స్టేషన్‌లోకి ఫ్లై ఓవర్‌పై మెట్లు మార్గం ద్వారా చేరాలి. ఎన్టీటీపీఎస్‌కు బొగ్గు రవాణా గూడ్స్ రైళ్లు నిత్యం సుమారు 50వరకు రాకపోకలు సాగిస్తాయి. ఆ క్రమంలో రైల్వేస్టేషన్‌కు పడమర వైపున నిత్యం గూడ్స్‌రైళ్లు నిలిచి ఉంటాయి. దీంతో ప్రయాణికులు కాలినడకతో స్టేషన్ లోపలకు అడుగుపెట్టే అవకాశం లేకుండా పోయింది. వృద్ధులు, దివ్యాంగులు స్టేషన్‌లోకి వేళ్లేందుకు ఫ్లై ఓవర్ మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తిగా మొదటి ప్లాట్ ఫారం

కొండపల్లి రైల్వేస్టేషన్‌లో పట్టాలకు సమాంతరంగా ప్లాట్‌ఫారమ్ లేకపోవడంతో రైళ్లు ఎక్కిదిగే సమయంలో వృద్ధులు, విద్యార్థులు, దివ్యాంగులు, మహిళలు కంకర రాళ్లపై బోగీ నుంచి దిగలేక ఎక్కలేక ప్రమాదాలకు గురవుతున్నారు.

మౌలిక సదుపాయాలు కరువు

కొండపల్లి రైల్వేస్టేషన్‌లో ఒక టాయిలెట్ ఏర్పాటు చేశారు. అది కూడా అపరిశుభ్రంగా ఉండడంతో ప్రయాణికులు ఇటీవల కాలంలో స్టేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్లాట్‌ఫారంపై ప్రయాణికులు నిల్చునేందుకు నీడలేదు. అక్కడక్కడా చిన్న సైజులో 10మంది నిల్చునే రెండు మూడు రేకుల షెడ్లు మాత్రం ఏర్పాటు చేశారు. సమస్యలపై స్టేషన్ మేనేజర్ అప్పారావును వివరణ కోరగా ఇటీవల ప్రయాణికుల నుంచి సమస్యలపై ఫిర్యాదులు అందాయి. వీటి పరిష్కారం కోసం రైల్వేశాఖ ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. ఆరో గ్రేడ్‌లో ఉన్న ఈ స్టేషన్‌లో లిఫ్ట్ సదుపాయానికి అవకాశం లేదని పేర్కొన్నారు.

ఆధునికతను అందిపుచ్చుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మానవ వనరుల(హెచ్‌ఆర్) రంగంలో వస్తున్న మార్పులను, ఆధునికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ ప్రెసిడెంట్, సీనియర్ హెచ్‌ఆర్ ప్రొఫెషనల్ ఎస్వీ నాథన్ అన్నారు. అమరావతి హెచ్‌ఆర్ చాప్టర్ ఏడో వార్షిక సమావేశం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో జరిగింది. ఈ సమావేశంలో ఎస్వీ నాథన్‌తో పాటు, సినీనటుడు, హెచ్‌ఆర్ ప్రొఫెషనల్ ప్రదీప్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థల అభివృద్ధికి, ఉద్యోగులకు మేలు జరిగేలా చేయాల్సిన బాధ్యత హెచ్‌ఆర్‌లపై ఉంటుందన్నారు. మన దేశం నేడు ఇంత ప్రబలమైన శక్తిగా ఉందంటే దానికి పునాది మనకున్న మానవ వనరులేనన్నారు. అమరావతి హెచ్‌ఆర్ చాప్టర్ మెంటార్ రాజశేఖర్ మాట్లాడుతూ హెచ్‌ఆర్‌లను ఒక తాటిపైకి తీసుకువచ్చి పరస్పర విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆధునిక పద్ధతులను, ఉత్తమమైన, నవీన పద్ధతులను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆ చాప్టర్ వ్యవస్థాపకులు, తల్లం రవితేజ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతాయనే భయం చాలా మందిలో ఉందన్నారు. అది ఉన్న కూడా ఆటోమేషన్, హ్యూమన్ టచ్‌ను సమన్వయం చేస్తూ హెచ్‌ఆర్ పాత్ర ఉంటుందన్నారు. రోబోట్‌ను నడిపించేవాడు కూడా మనిషే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.